సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 10 | జూలై | 2024



వరుస తనిఖీలతో వణుకు

ఎంజీఎంలో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ ఆస్పత్రిని స్వయంగా పరిశీలించారు. - 8లో▸



కేయూకు రూసా నిధులు

కాకతీయ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాభియాన్ (రూసా) రూ.45.50 కోట్లు విడుదల చేసింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$37^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి



భూపాలపల్లి అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్‌హుస్సేన్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఏరియాలోని జీఎం కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులకు నార సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు జోతి, తుకారాం, శ్రీనివాస్, పోషమల్లు, క్రాంతికుమార్, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



భూపాలపల్లి అర్బన్: సింగరేణి గనుల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఏరియాలోని జీఎం కార్యాలయం ఎదుట చేపడుతున్న దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. మంగళవారం దీక్షలను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజ్ సతీష్ ప్రారంభించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నారాయణమూర్తి, మల్లికార్జున్, రాజేందర్, నాగ్రేందబాబు, సత్తి, కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వీఆర్‌ఓల వినతి



భూపాలపల్లి రూరల్: వీఆర్‌ఓలను తిరిగి గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మ, వెంకటస్వామి, నారాయణ, చంద్రమోహన్, శ్రీనివాస్, హనుమంతు, అశోక్, సాంబశివుడు, రంజిత్ ,సురేష్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జలపాతంలోకి దిగొద్దు



వాజేడు: బొగత జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులు జలపాతంలోకి దిగవద్దని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ అన్నారు. మండల పరిధిలోని చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతాన్ని మంగళవారం వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్‌తో కలిసి పరిశీలించారు. వరద ప్రవాహం పరిస్థితి, సందర్శకుల తాకిడి గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులు ఎవరూ లోపలికి వెళ్ల వద్దని, వీక్షకులను లోపలికి వెళ్లకుండా జాగ్రత్తగా చూడాలని అక్కడ ఉన్న సిబ్బందికి సూచించారు.

ఐటీడీఏలో కంట్రోల్ రూం ఏర్పాటు

ఏటూరునాగారం: ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముంపు ప్రాంతాల ప్రజలను ఆపద సమయంలో ఆదుకునేందుకు ఐటీడీఏ కార్యాలయంలో పీఓ చిత్రామిశ్రా కంట్రోల్‌రూంను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూం 24గంటలు పనిచేస్తుందని తెలిపారు. నారాయణ, ప్రభాకర్, కిరణ్, ఐజాక్, సమ్మయ్య, మల్లేశం, కిరణ్‌కుమార్, హేమంత్, రవీందర్, రమేష్‌లకు షిఫ్టుల వారీగా విధులను కేటాయించారు. అలాగే ఎన్‌డీఆర్‌ఎఫ్ దళానికి సంబంధించిన అధికారి బాలు నంబర్ 9493771043, ఇరిగేషన్‌కు చెందిన బుచ్చిమల్లయ్య నంబర్ 9491563032, శ్రీకాంత్ 6309783077లకు సమాచారం కూడా ఇవ్వవచ్చని తెలిపారు. అంతేకాకుండా సమస్యను సెల్ నంబర్ 6309842395లో కూడా సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రయోగాల్లేవ్..

అటకెక్కిన సైన్స్ విద్య
- ఐదేళ్లుగా నిలిచిపోయిన నిధుల మంజూరు
- పాత పరికరాలతోనే కాలం వెల్లదీత
- సాంకేతిక విద్యకు దూరమవుతున్న విద్యార్థులు



పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు	317
ప్రాథమికోన్నత పాఠశాలలు	44
ఉన్నత పాఠశాలలు	69
విద్యార్థుల సంఖ్య	24,710

కాటారం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాలతో సైన్స్ విద్యను అందించి సత్ఫలితాలు సాధించడానికి ఏర్పాటు చేసిన ప్రయోగాత్మక బోధన జిల్లాలో అటకెక్కింది. ఐదేళ్లుగా నిధుల విడుదల లేకపోవడం, ప్రయోగ పరికరాలు పూర్తిగా లేకపోవడం తదితర కారణాలతో విద్యార్థులకు సైన్స్ విద్య అందడం లేదు. దీంతో ఉపాధ్యాయులు మౌలిక బోధనలతోనే పాఠాలు చెప్పి మమా అనిపిస్తున్నారు. ఫలితంగా విలువైన విజ్ఞాన విద్య పూర్తిగా అందకపోవడమే కాకుండా సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన లేకుండా పోతుంది.

ప్రయోగాలు కీలకం..

ఆరవ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ సబ్జెక్ట్‌లో ఎక్కువ భాగం ప్రయోగాలతో కూడిన పాఠ్యాంశాలు ఉన్నాయి. వాటిని ప్రయోగం చేసి చూపితే గాని అర్థం కాని పరిస్థితి ఉంటుంది. దీంతో ప్రయోగాత్మక బోధనపై సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందుకోసం ప్రయోగ పరికరాలు, రసాయనాల కొనుగోలుకు గతంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు విన్నవించగా అనుమతించారు. అప్పట్లో అరకొర నిధుల మంజూరుతో పూర్తిస్థాయిలో పరికరాల కొనుగోలు సాధ్యపడలేదు. నిధులకు అనుగుణంగా కొనుగోలు చేసిన కొద్దిపాటి పరికరాలతో ప్రయోగాలు సంపూర్ణంగా చేసే అవకాశం లేకపోవడంతో పలు పాఠశాలల్లో అవి సైతం మూలనపడ్డాయి.

ఐదేళ్లుగా జాడలేని నిధులు..

2019 సంవత్సరంలో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్(ఆర్‌ఎంఎస్‌ఏ) ద్వారా ప్రతి ఉన్నత పాఠశాలకు రూ.50 వేల చొప్పున, ప్రాథమికోన్నత పాఠశాలకు సర్వశిక్షా అభియాన్ ద్వారా రూ.22వేల నిధులను విడుదల చేశారు. వీటిద్వారా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్ల క్రితం కొన్ని ప్రయోగ పరికరాలు కొనుగోలు చేశారు. ఆర్‌ఎంఎస్‌ఏ పథకం అమలు నిలిచిపోవడంతో నిధులు మంజూరు కావడం లేదు. దీంతో పాఠశాలల్లో ప్రయోగాత్మక బోధన నిర్వహణ కష్టతరంగా మారింది. అందుబాటులో ఉన్న కొన్ని పరికరాలతో పాటు కాలంచెల్లిన రసాయనాలతో ఉపాధ్యాయులు ప్రయోగాలను నామమాత్రంగా వివరిస్తూ కాలం వెల్లదీస్తున్నారు.



కాటారం మండలం ఒడిపిలవంచ ప్రభుత్వ పాఠశాలలో నిరుపయోగంగా సైన్స్‌ల్యాబ్



చింతకాని హైస్కూల్‌లో అసంపూర్తి నిర్మాణంలో సైన్స్‌ల్యాబ్

పోటీలకు దూరంగా..

ప్రయోగాలపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో సైన్స్‌కు సంబంధించిన పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్వహించే సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ అవార్డుల కార్యక్రమాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ప్రతిభ కనబరిచే సత్తా విద్యార్థుల్లో లేకుండా పోతుంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రయోగాత్మక బోధనకు అవసరమైన పరికరాలు సమకూర్చడంతో పాటు బోధన జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నాం..



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నాం. సైన్స్ ప్రయోగశాల నిర్వహణ, సైన్స్ పరికరాల కొనుగోలు కోసం ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. పాఠశాల నిర్వహణ కోసం వచ్చే నిధులతోనే సైన్స్ ప్రయోగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసుకోవాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించి ఉపాధ్యాయులు ప్రయోగాలు చేయించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

– రాజేందర్, ఇన్‌చార్జ్ జిల్లా విద్యాశాఖ అధికారి

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క



దివ్యాంగులకు స్కూటీలు అందజేస్తున్న మంత్రి సీతక్క

- పంచాయతీరాజ్, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు: గ్రామీణ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. త్వరలోనే మహిళలకు మీసేవ, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు చేసే వారికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో కలెక్టరేట్, ఏరియా ఆస్పత్రి, ఐటీడీఏ, రామప్ప దేవాలయాల ఆవరణలో నాలుగు ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ ఏడాది రూ.20 వేల కోట్ల రుణాలు బ్యాంక్ లింకేజీ ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మహిళా మీసేవా కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్ మెంట్లు, డెయిరీ ఫామ్‌లు, సోలార్‌లైట్లు, అదేవిధంగా 60 లక్షల పాఠశాలలకు ఏక రూప దుస్తులు మహిళ సంఘాల ద్వారా కుట్టించ నున్నట్లు తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్‌లలో ఆహారం అమ్మ చేతి వంటలా ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్థానిక వనరులను ఉపయోగించుకుని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్‌ను త్వరలోనే రూపొందిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో మహిళా సంఘాలకు బ్యాంక్ రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలకు అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించడంతో పాటు వడ్డీలేని రుణసౌకర్యం ప్రభుత్వం కల్పింస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో దివ్యాంగులకు, ట్రాన్స్ జెండర్లకు ఉపకరణాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో కొందరు పుట్టుకతో, మరికొందరు అనారోగ్యంతో పాటు ప్రమాదాల కారణంగా దివ్యాంగులుగా మారుతున్నారని తెలిపారు. అలాంటి వారికి తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. శరీరంలో వచ్చే వివిధ రకాలైన మార్పుల కారణంగా పలువురు ట్రాన్స్‌జెండర్లుగా మారుతారని తెలిపారు. అలాంటి వారికి హక్కులు, ఆత్మగౌరవం ఉంటుందన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ఉపకార వేతనాలు, ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన పొంది ఉన్నతంగా ఎదగాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం ప్రతీ ఒక్కరి బాధ్యతని వీరిని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేకంగా రూ.75కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లెనినా, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపాధ్యాయులు లేరు..



మహాముత్తారం మండలంలోని అటవీ ప్రాంతమైన రెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 30మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. మరో ఉపాధ్యాయుడిని వారం రోజుల క్రితం టేకుమట్లకు బదిలీ చేశారు. అప్పటి నుంచి పాఠశాలకు ఉపాధ్యాయులు ఎవరూ లేరు. దీంతో పాఠశాలకు విద్యార్థులు వచ్చి కాసేపు ఆటలాడుకుని వెళ్లిపోతున్నారు. ఈ విషయమై డీఈఓను వివరణకోరగా ఉపాధ్యాయుడిని నియమించే ప్రయత్నం చేస్తానని చెప్పారు.

–మహాముత్తారం

కొండాయి రూట్ బంద్

- రోడ్డుపై కూలిన భారీ వృక్షం
- దొడ్ల వైపు దారి మూసివేసిన అధికారులు



కొండాయివైపు కూలిన భారీ వృక్షం

ఏటూరునాగారం: మండల పరిధిలోని కొండాయి గ్రామానికి వెళ్లే దారి పూర్తిగా నిలిపివేశారు. గతేడాది జంపన్నవాగుపై ఉన్న కొండాయి బ్రిడ్జి కూలిపోవడంతో మల్యాల, కొండాయి, గోవిందరాజుల కాలనీకి చెందిన ప్రజలు ఏడాది నుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది నవంబర్‌లో తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. ఐటీడీఏ నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జాప్యం జరుగుతుండడంతో రాకపోకలకు నిత్యం నరకయాతన పడుతున్నారు. వాగులో నుంచి ప్రజలు నడిచి వస్తున్నారని అధికారులు దొడ్ల వైపు ఉన్నదారిని పూర్తిగా మూసివేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కొండాయి వైపు ఉన్న రోడ్డుకు అడ్డుగా భారీ వృక్షం పడడంతో నడకదారి కూడా లేకుండా పోయింది. తమకు దారిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

సరుకుల నాణ్యతలో రాజీపడొద్దు

- ఏపీఓ వసంతరావు

ఏటూరునాగారం: గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సరఫరా చేసే సరుకుల నాణ్యతలో రాజీపడొద్దని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో గతంలో నిర్వహించిన టెండర్లను మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏలో ఓపెన్ చేశారు. మటన్, చికెన్, కోడిగుడ్లు, కూరగాయలు సరఫరా చేసేందుకు సేలర్స్ 299 మంది డీడీలు కట్టి టెండర్లు వేశారని ఏపీఓ తెలిపారు. ఇందులో తక్కువ కోడ్ చేసిన వారికి ఏజెన్సీని అప్పగిస్తామన్నారు. గతేడాది రూ.18 కిలో ఇచ్చిన కూరగాయలు ఈ ఏడాది రూ.14కు ఇస్తున్నట్లు తెలిపారు. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో 26 కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయని వివరించారు. ఇందులో చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాల్సి ఉందని తెలిపారు. ఇందుకు గాను టెండర్ల ద్వారా ఏజెన్సీలకు కాంట్రాక్టును అప్పగించి ఈ ఏడాది విద్యాసంవత్సరం పూర్తయ్యే వరకు అగ్రిమెంట్‌లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా నాసిరకమైన సరుకులు సరఫరా చేస్తే వెంటనే కాంట్రాక్టును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, డీడీ పోచం, ఎస్‌ఓ రాజ్‌కుమార్, హెచ్‌డబ్ల్యూఓలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



కాంట్రాక్టర్లకు సూచనలు చేస్తున్న ఏపీఓ వసంతరావు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



భూపాలపల్లి రూరల్: ఎకో పార్కులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్‌శర్మ



భూపాలపల్లి అర్బన్: వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్: పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని జయశంకర్ ఎకో పార్కులో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, పాఠశాలల్లో మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఇంటి ఆవరణలో కనీసం మూడు నుంచి ఐదు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తమ ఇంటి ఆవరణలో ఖాళీ స్థలాల్లో కచ్చితంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్‌ఓ వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, చెల్పూరు రేంజ్ అధికారి నాగరాజు, అటవీ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ వివిధ అంశాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు. అనంతరం అటవీ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, వైద్య, విద్యా, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో వన మహోత్సవానికి 26.129 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. ఇప్పటి వరకు 3.70 లక్షల మొక్కలు నాటినట్లు చెప్పారు. 25 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఎలాంటి కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నరేష్, డీపీఓ నారాయణరావు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌భాస్కర్, డీఈఓ రాజేందర్, ఆర్డీఓ మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



హాజరైన అధికారులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేద వారికి అందించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. నియోజకవర్గంలో పనుల పురోగతిపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్ పనులపై దృష్టిసారించి పూర్తిచేయాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, ఇతర శాఖల మంత్రులతో మాట్లాడి నిధులు తీసుకువస్తున్నానని.. అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. బుద్ధారం నుంచి కోటంచ వరకు రహదారి నిర్మాణానికి రూ.59 కోట్లు, కోటంచ దేవాలయం అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవతో రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టేకుమట్ల–రాఘవరెడ్డిపేట మధ్య చలి వాగుపై నిర్మిస్తున్న వంతెనను 20రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. రామప్ప చెరువు నుంచి వంగపల్లి చెరువు మీదుగా గణపసముద్రం చెరువులోకి నీరు సరఫరాకు గ్రావిటీ కెనాల్ నిర్మాణానికి భూ సేకరణ చేపట్టాలన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రతి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని చెప్పారు. నెలలో మూడుసార్లు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను శుభ్రపరుస్తూ క్లోరినేషన్ చేయాలని, పైపులైన్ల లీకేజీని అరికట్టాలని అన్నారు. ఒడితల, నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్‌లలో సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ సమావేశానికి హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. అధికారులకు క్షేత్రస్థాయిలో ప్రతి విషయంపై అవగాహన ఉండాలని అన్నారు. జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై కిందిస్థాయి అధికారులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, వైద్య, విద్య, పంచాయతీరాజ్, ఎస్సీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ, విద్యుత్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు టూ-డే క్రికెట్ జట్టు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల రెండో వారంలో హైదరాబాద్‌లో జరగనున్న టూ-డే లీగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 11వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఎంపిక పోటీలకు 25 సంవత్సరాల లోపు (1999 ఆగస్టు 31 తర్వాత జన్మించిన) వయసు గల క్రీడాకారులు అర్హులుగా తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఒరిజనల్ ఆధార్ కార్డు, సొంత క్రికెట్ కిట్, యూనిఫామ్‌తో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9849570979 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ట్యాబ్లెట్లు మింగి వ్యక్తి ఆత్మహత్య

- చల్లగరిగలో ఘటన



శివరామకృష్ణ (ఫైల్)

చిట్యాల: భార్య కాపురానికి రాకుండా కోర్టు నుంచి విడాకుల నోటీసు పంపడంతో మనస్తాపం చెందిన భర్త అధికంగా ట్యాబ్లెట్లు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పినిగాని శివరామకృష్ణ (34)కు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తికి చెందిన కూచన మారుతితో వివాహం జరిగింది. వీరి కాపురం కొంతకాలం సజావుగా జరిగింది. అనంతరం కుటుంబ కలహాలతో మారుతి తన తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. కాపురానికి రాకుండా కోర్టు ద్వారా విడాకుల నోటీసులు పంపింది. దీంతో మనస్తాపం చెందిన శివరామకృష్ణ మంగళవారం తెల్లవారుజామున ట్యాబ్లెట్లు అధికంగా మింగడంతో స్పృహ కోల్పోయాడు. దీనిని తండ్రి రాజేందర్ గమనించి శివరామకృష్ణను హుటాహుటిన వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటనపై తన కుమారుడి మృతికి కారణమైన అతడి భార్య మారుతి, మామ నర్సింగం, అత్త లక్ష్మి, బావమరిది రాజేంద్రప్రసాద్‌పై మృతుడి తండ్రి రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మనస్తాపంతో మహిళ ..



సునీత మృతదేహం

ఎల్కతుర్తి: తన బిడ్డ పెళ్లికోసం చేసిన అప్పు ఎలా తీరుతుందోనని మనస్తాపం చెందిన ఓ మహిళ.. విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం వంగరంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40) తన కూతురు పెళ్లి కోసం రూ.15 లక్షల అప్పు చేసింది. అప్పుకు వడ్డీ పెరగడంతో సొంత ఇల్లు కూడా అమ్మి కొంత అప్పు చెల్లించింది. అయినా అప్పు తేరలేదు. దీంతో అప్పు ఎలా తీరుతుందోనని మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉంది.

భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

- వరంగల్ నగరంలో ఘటన
- అనాథలైన ముగ్గురు పిల్లలు



మంద చరణ్, స్వప్న(ఫైల్)



అనాథలైన ముగ్గురు పిల్లలు



ఆర్థిక సాయం అందజేస్తున్న మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య

కాశిబుగ్గ : కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన భర్త తనూ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి చనిపోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటన వరంగల్ నగరంలోని చెన్నారెడ్డికాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్(45) అలియాస్ చేరాలు ఉర్సుకు చెందిన అక్క కూతురు స్వప్న(42)ను 18 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చరణ్ మేస్త్రీ పనిచేస్తుండగా, స్వప్న నగరంలోని ఓ బట్టల షాపులో పనిచేస్తుంది. ఇరువురి కాపురం కొన్నేళ్లు బాగానే సాగింది. తరువాత ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో చరణ్ సోమవారం సాయంత్రం ముగ్గురు పిల్లలను ఉర్సులోని మేనమామ ఇంటికి పంపించాడు. అర్ధరాత్రి సమయంలో స్వప్నను రోకలిబండతో తీవ్రంగా కొట్టి చంపాడు. అనంతరం భయాందోళనకు గురైన చరణ్ మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. 11.30 గంటల సమయంలో మేనమామ ఇంటి నుంచి తిరిగి వచ్చిన పిల్లలు డోరు తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. వెనుక వైపునుంచి ఇంట్లోకి వెళ్లగా తల్లిదండ్రులు మృతిచెంది రక్తం మడుగులో ఉన్నారు. వెంటనే భయంతో స్థానికులకు తెలిపారు. వాళ్లు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్, మిల్స్‌కాలనీ సీఐ మల్ల య్య క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

అనాథలైన ముగ్గురు పిల్లలు..

కుటుంబ కలహాలు, క్షణికావేశంతో తల్లిదండ్రులు ఇద్దరు ఒకేసారి మృతిచెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. రెండో కూతురు మెర్సి(12)కి గుండెలో రంధ్రం ఉంది. అలాగే కుమారుడు షాలుమ్(11) అంధుడు. తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో వీరిని ఎవరు చూసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దాతృత్వం చాటిన పోలీసులు, స్థానికులు..

తల్లిదండ్రులు చనిపోవడంతో అంత్యక్రియలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో దీనంగా చూస్తున్న పిల్లలను చూసి చలించిన పోలీసులు, స్థానికులు ఆర్థికసాయం చేశారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య రూ.10వేలు, ఇద్దరు ఎస్సైలు చందర్, శ్రీకాంత్‌లు చేరో రూ.5వేలు, స్థానిక కార్పొరేటర్ వస్కుల బాబు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ చేరో రూ. 5 వేలు, గడ్డమీది రాజేష్, లాయర్ మామిడాల రమేష్‌లు చేరో రూ.3వేలు అందించారు. కాలనీవాలసులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.

వరుస తనిఖీలతో వణుకు..

- ఎంజీఎంలో కొనసాగుతున్న తనిఖీలు
- నాలుగో రోజు ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ వెంకటరమణ
- అధికారులు, వైద్యుల్లో భయం..భయం



ఉదయం 10.30 గంటలకు చికిత్స పొందుతున్న రోగులు

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎంలో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ.. ఆస్పత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో స్వయంగా పరిశీలించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ పర్యటించిన అనంతరం సమీక్షలో పేర్కొన్న అంశాల మేరకు సార్టింగ్ ఓపీ, రోగులకు బెంచీలు, వైద్యులు మెమోలు పూర్తిస్థాయిలో ఇచ్చారా లేదా అనే అంశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. సార్టింగ్ ఓపీని మూడు రోజులైనా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ప్రారంభించలేదనే విషయం గుర్తించారు. అంతేకాకుండా వైద్యుల కొరత ఉందని కలెక్టర్ సమీక్షలో పేర్కొన్న సూపరింటెండెంట్.. కొంత మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యులను ఓపీ, క్యాజువాలిటీ విధులకు పంపించకుండా అడిషనల్ ఆర్‌ఎంఓలుగా తన వద్దే ఉంచుకోవడం ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారింది.

కాన్ఫరెన్స్ హాల్‌ను ఓపీగా మార్చే పనులు ప్రారంభమెప్పుడు?

ప్రస్తుతం కొనసాగుతున్న సూపరింటెండెంట్ కార్యాలయం.. డెర్మటాలజీ ఓపీ విభాగంగా కొనసాగేది. ఆస్పత్రికి కేటాయించిన నిధులతో డెర్మటాలజీ ఓపీ గదులను సూపరింటెండెంట్ చంద్రశేఖర్ లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ హంగులతో నిర్మించారు. ఈ క్రమంలో డెర్మటాలజీ ఓపీ కిక్కిరిసిపోవడంతో విభాగాన్ని గ్రౌండ్ ఫ్లోర్‌కు తరలించారు. శనివారం ఓపీని సందర్శించిన కలెక్టర్.. రద్దీగా ఉన్న విషయాన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమీ చేయలేమా అని సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ప్రత్యామ్నాయం ఏం చేయలేమని, ఎక్కడా స్థలం లేదని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో ఇంత పెద్ద హాల్ సమావేశాలకు ఎందుకని, వైద్యసేవలకు మార్చాలన్నారు. రోగులకు మెరుగైన సేవలందించడమనే లక్ష్యమని, సమావేశాలు కాకతీయ మెడికల్ కళాశాలతోపాటు ఆస్పత్రిలో పలు ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. వెంటనే సమావేశ మందిరాన్ని నిత్యం రద్దీగా ఉండే మరో మెడిసిన్ ఓపీగా మార్చాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన సమయంలో సరే అని అంగీకరించిన సూపరింటెండెంట్.. ఆ దిశగా అడుగులు వేస్తాడా..? ఇష్టంగా నిర్మించుకున్న కార్యాలయాన్ని కొనసాగించే ప్రయత్నాలు చేస్తాడా అనే విషయం ఆస్పత్రిలో చర్చగా మారింది.

సమయపాలనతో రోగులకు మెరుగైన సేవలు..

బయోమెట్రిక్ హాజరుశాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తుండడంతో ఓపీ సమయానికి వైద్యులు విధులకు వస్తున్నారు. 90 శాతం మంది వైద్యులు విధులకు హాజరవుతుండగా 10 శాతం మాత్రం ఇంకా తీరు మార్చుకోవడం లేదు. కాగా, నిత్యం ఒంటి గంట పాటు వైద్యం కోసం కుస్తీ పట్టే రోగులు.. ప్రస్తుతం 11 గంటల వరకే చికిత్సలు పొంది ఇంటికి వెళ్తున్నారు.

అధికారులు, వైద్యుల్లో భయం.. భయం

నాలుగు రోజుల నుంచి ఎంజీఎం ఆస్పత్రిని కలెక్టర్ తోపాటు ఆర్‌డీఓ, డీఎంహెచ్‌ఓ నిత్యం తనిఖీలు చేస్తూ పాలనపై ప్రత్యేక దృష్టిసారించారు. కలెక్టర్ ఆదేశాలు సూపరింటెండెంట్, వైద్యులు ఏ మాత్రం పాటిస్తున్నారో అనే అంశంపై నిత్యం తనిఖీలతో ఆస్పత్రిలో అంతా హడావిడి నెలకొంది. దీంతో అధికారులు, వైద్యుల్లో భయం నెలకొంది. కాగా, రోగుల బాగోగులపై ఇలా జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు ముందుకెళ్లడంపై పేద రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి పూర్తిస్థాయిలో గాడిన పడే వరకూ అధికారులు దృష్టి సారించాలని వారు వేడుకుంటున్నారు.

కానిస్టేబుల్ దూషించాడని.. యువకుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఉదయ్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : కానిస్టేబుల్ తనను అకారణంగా అసభ్యకర పదజాలంతో దూషించాడని ఆరోపిస్తూ ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం ... మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని చాపల మార్కెట్ బజారుకు చెందిన బత్తిని ఉదయకుమార్ తనకు ఒకరి వద్ద నుంచి డబ్బులు రావాల్సి ఉండగా అందుకు సంబంధించిన ఫిర్యాదు ఇచ్చేందుకుగాను మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. అదే సమయంలో అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రుద్రయ్య విషయం ఏమిటని ఉదయ్ కుమార్‌ను అడగగా తనకు డబ్బులు రావాల్సి ఉండగా ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చానని, అన్నా అంటూ సంబోధిస్తూ తెలిపాడు. ఇందుకు ఆగ్రహించిన కానిస్టేబుల్ రుద్రయ్య.. నన్ను అన్న అంటావా.. నువ్వు ఒక రౌడీషీటర్ అని అనడమే కాకుండా చెప్పలేని విధంగా అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో మనస్తాపన గురైన ఉదయ్ కుమార్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై టౌన్ సీఐ దేవేందర్‌ను వివరణ కోరగా బాధితుడి ఆరోపణ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక..

- విద్యార్థిని బలవన్మరణం
- నమిలిగొండలో ఘటన
- శోకసంద్రంలో కుటుంబీకులు




రితీష (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని నమిలిగొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దపూండ్ర స్వాతి, శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె రితీష (16) శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదివింది. ఇంటర్ విద్య కోసం తల్లిదండ్రులు.. రితీషను భీమదేవరపల్లిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో చేర్పించారు. అయితే అక్కడ హాస్టల్‌లో ఉండి చదవడం ఇష్టం లేదని చెప్పగా నచ్చచెప్పారు. ఈ క్రమంలో ఇటీవల తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాస్టల్‌లో ఉండనని చెప్పడంతో తండ్రి వెళ్లి రితీషను ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 7వ తేదీన (ఆదివారం) తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా రితీష గడ్డి నివారణ మందు తాగి ఇంటి నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో వ్యవసాయ బావుల వైపునకు వెళ్తున్న వారికి తాను గడ్డి నివారణ మందు తాగానని, మా నాన్నకు చెప్పాలని పేర్కొంది. దీంతో వారు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. తల్లిదండ్రులు వెంటనే ఇంటికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న రితీషను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె అర్థాంతరంగా తనువు చాలించడంతో మృతదేహంపై పడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐరాజు తెలిపారు. కాగా, నమిలిగొండకు చెందిన బీఆర్ఎస్ మండల మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు పెద్దపూండ్ర స్వాతిరెడ్డి కుమార్తె రితీష మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

కేయూకు 'రూసా' నిధులు

- రూ.45.50 కోట్ల విడుదలకు ఉత్తర్వులు



కేయూలో నిర్మించిన కే హబ్ భవనం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీకి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షాభియాన్ (రూసా) రూ.45.50 కోట్లు విడుదల చేసింది. యూనివర్సిటీ అధికారులు 2019–20లో కే హబ్ కోసం, సైన్స్ విభాగాల మధ్య మల్టీ డిసిప్లినరీ పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు వ్యక్తిగతంగా పరిశోధనలు చేసేందుకు రూ.50 కోట్లతో రూసాకు ప్రతిపాదనలు పంపారు. అయితే కొంత నిధులు రాగా యూనివర్సిటీ క్యాంపస్‌లో కే (నాలెడ్జ్) హబ్ భవనం నిర్మించి మార్చిలో ప్రారంభించారు. కాగా కే హబ్‌లో మౌలిక వసతుల కల్పించాల్సి ఉంది. అప్పటి ప్రతిపాదనలలో మిగతా నిధులు రూ.45.50 కోట్లు విడుదల చేస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, రూసా ప్రాజెక్టు డైరెక్టర్ బుర్రా వెంకటేశం, పీఓ సౌందర్య జోసెఫ్ ఉత్తర్వులు జారీచేశారు.

రూ.35 కోట్లు పరిశోధనలకు వ్యయం

యూనివర్సిటీలో పరిశోధన ప్రాజెక్టులు, అధ్యాపకులు, వ్యక్తిగతంగా చేసే పరిశోధనలకు సంబంధించి రూసా నుంచి రూ.35 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల అయ్యాయని సమాచారం. అందులో రూ.23 కోట్లతో ఐదు విభాగాలకు, మరో రూ.12 కోట్లు వ్యక్తిగతంగా పరిశోధన ప్రతిపాదనలు పంపిన వారికి కేటాయిస్తారు. ప్రాజెక్టులో భాగంగా పరికరాల కొనుగోలు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్స్ కోసం వివిధ రకాలైన పరిశోధనల నిమిత్తం ఉపయోగించుకుంటారు. నిధుల వినియోగంపై ఈనెల 8న హైదరాబాద్‌లో కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి చర్చించారని సమాచారం. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఎంవోయూలు కొనసాగించి పరిశోధనలతో ముందుకెళ్లాలని వాకాటి కరుణ కోరారని సంబంధిత అధికారులు తెలిపారు.

సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో అడ్వాన్స్ బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులో శిక్షణ

- శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేత

సాక్షి మైత్రి మహిళ





సాక్షి మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు అడ్వాన్స్ బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఇస్తారు.

బ్యూటీషియన్ శిక్షణలో నేర్పించే అంశాలు

థ్రెడ్డింగ్, అడ్వాన్స్ పెడిక్యూర్, అడ్వాన్స్ మెనిక్యూర్, ఫేస్ లిఫ్టింగ్ ఫేషియల్స్, అడ్వాన్స్ హెన్నా, పీల్ ఆఫ్ ఫేషియల్స్, పింపుల్ ట్రీట్‌మెంట్, డాండ్రఫ్ ట్రీట్‌మెంట్, ర్రికింల్స్ ట్రీట్‌మెంట్, అడ్వాన్స్ హెయిర్ కట్స్, అడ్వాన్స్ హెయిర్ స్టైల్స్ (బ్రైడల్ స్టైల్స్‌తో కలిపి),హెయిర్ కర్లింగ్, హెయిర్ స్ట్రెయిటనింగ్, శారీ డ్రాపింగ్ (బ్రైడల్ స్టైల్స్‌తో కలిపి), పిగ్మెంటేషన్, గన్‌షాట్, బాడీ మసాజ్, అడ్వాన్స్ మేకప్స్ (బ్రైడల్ మేకప్స్‌తో కలిపి), బ్రైడల్ మెహందీ, గాల్వానిక్, స్కిన్ టైటనింగ్.

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.5,000

నోట్: బేసిక్స్ రాని వారికి బేసిక్స్ నేర్పించబడును. దీనికి అదనంగా రూ.3,500 ఫీజు చెల్లించాలి.

టైలరింగ్ శిక్షణలో నేర్పించే అంశాలు

- మెథడ్ ఆఫ్ కటింగ్, మెథడ్ ఆఫ్ స్టిచింగ్, బేబీఫ్రాక్, డ్రెస్ పెట్టికోట్, సారీ పెట్టికోట్.
- టాప్స్: స్మాల్ అంబ్రెల్లా, ఫిష్ అంబ్రెల్లా, సెమీగౌన్, సెమీ పట్యాల, ఫుల్ పట్యాల, బెల్లీఫ్రాక్, లాంగ్ ఫ్రాక్.
- బ్లౌజెస్: రౌండ్ నెక్, స్క్వేర్ నెక్, హైనెక్, బ్యాక్ ఓపెన్ బ్లౌజ్, కాలర్ నెక్, ప్యాచ్ నెక్, బోట్‌నెక్, ప్రిన్స్‌కట్, సింగిల్ కటోర, మరియు వివిధ రకాల స్లీవ్(చేతుల)డిజైన్స్.
- బాటమ్‌వేర్స్: ప్లాజా, చుడీపాయింట్, కుర్తిపాయింట్, స్లిమ్ ఫిట్, సల్వార్ కమీజ్, స్ట్రైట్‌కట్

రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.3,500

రిజిస్ట్రేషన్ తేదీలు : 08.07.2024 నుంచి 12.07.2024 వరకు

రిజిస్ట్రేషన్ సమయం : ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు

వర్క్‌షాప్ షెడ్యూల్ తేదీలు : 13.07.2024 నుంచి 12.08.2024 వరకు

(శిక్షణ సమయం: ఉదయం 11 నుంచి సాయంత్రం 6గంటల వరకు)

రిజిస్ట్రేషన్ మరియు శిక్షణ స్థలం: సాయి శివాని ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, ఫస్ట్‌ఫ్లోర్, స్వదేశీ మార్ట్ కాంప్లెక్స్, ఎస్సార్ కాలేజ్ దగ్గర, వడ్డేపల్లి రోడ్, సుబేదారి, హనుమకొండ.

సంప్రదించాల్సిన నంబర్లు: 95055 14424, 98664 25369

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- మాజీ సర్పంచ్ బిల్లుల కోసం రూ.20 వేల డిమాండ్



ఏసీబీకి పట్టుబడిన శివాజీ

రఘునాథపల్లి: గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు తాజా మాజీ సర్పంచ్‌భర్తనుంచి లంచం డిమాండ్ చేసిన పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపల్లి మండలం కంచనపల్లి మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వర్‌రావు 2023–24కు సంబంధించి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకుగాను రూ.1.53 లక్షల బిల్లులను మార్చిలో ఎస్‌టీఓకు పంపగా ఫ్రీజింగ్ కారణంగా డ్రా కాలేదు. ఆ చెక్కు పనిచేయకపోవడంతో తిరిగి ఆ బిల్లులు పొందేందుకు పంచాయతీ కార్యదర్శి పగిడె శివాజీని కలిశాడు. రూ.50వేల లంచం కావాలని, లేకుంటే పని కాదని కార్యదర్శి తేల్చి చెప్పాడు. చివరికి రూ.20వేలకు శివాజీ ఒప్పుకున్నాడు. అనంతరం నాగేశ్వర్‌రావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు నాగేశ్వర్‌రావు మంగళవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి లంచం డబ్బులు ఇస్తానని సంప్రదించగా.. తాను మండల పరిషత్ కార్యాలయంలో ఉన్నానని, ఇక్కడికే రావాలని సూచించాడు. కార్యాలయానికి వెళ్లిన నాగేశ్వర్‌రావు రూ.20 వేలు శివాజీకి అందజేస్తుండగా అప్పటికే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి కార్యదర్శిని అరెస్ట్ చేశారు. అతడిని కోర్టులో హాజరు పరుస్తామని, ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 1064లో సంప్రదించాలని డీఎస్పీ పేర్కొన్నారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఏ.శ్యాంసుందర్, ఎస్ రాజు, ఎల్ రాజు ఉన్నారు.

నాలుగు నెలలుగా సతాయించాడు..

ఫ్రీజింగ్ కారణంగా చెక్ రిజెక్ట్ అయిందని, తిరిగి చెక్ జనరేట్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి నాలుగు నెలలుగా సతాయించాడని మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. సర్పంచ్ పదవీ కాలం ముగియడంతో తమను అవమానించేలా వ్యవహరించాడన్నారు. తాము నిజాయితీగా పనులు చేసిన ఎంబీ రికార్డుల మేరకే బిల్లుల కోసం సంప్రదిస్తే లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించాల్సి వచ్చిందని నాగేశ్వర్‌రావు తెలిపారు.

ప్రజలు గుణపాఠం చెప్పినా మోదీ వైఖరి మారలేదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణ పాఠం చెప్పినా ప్రధాని మోదీ వైఖరిలో మార్పు రాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. వరంగల్ కొత్తవాడలో సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ అధ్యక్షతన పార్టీ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముందు సీపీఐ పతాకాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శిక్షణ తరగతుల ప్రారంభ సభలో చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడంతోనే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేసి, అనేక మందిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తెచ్చారని, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని, దాదాపు రూ. 12 లక్షల కోట్లు వారికి రాయితీ ఇచ్చారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను కూడా అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, ఎస్.అశోక్ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా,పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, గుండె బద్రి, దామెర కృష్ణ, జన్ను రవి, వేల్పుల సారంగపాణి, రహెలా, అమ్జద్, రమేష్ పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి సాగుకు సిద్ధం కావాలి

- సహాయ వ్యవసాయ సంచాలకుడు నగేష్


నర్సంపేట : ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అనుసరించి రైతులు స్వల్ప కాలిక వరి రకాల సాగుకు సిద్ధం కావాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు డాక్టర్ కేసరి నగేష్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు కురిసిన వర్షాలు కేవలం పత్తి, మొక్కజొన్న పంటలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. అయితే రైతులు మాత్రం వరి నార్లు పోసుకుంటున్నారన్నారు. వరి పంటకు అనుకూలమైన వర్షపాతం ఇంత వరకు నమోదు కాలేదని, ఈ పరిస్థితుల్లో దీర్ఘకాలిక వరి రకాల సాగు ఆచరణ యోగ్యం కాదన్నారు. స్వల్ప కాలిక రకాలు 120-125 రోజుల పంట కాల వ్యవధి కలిగి ఉంటాయని, ఈ రకం సాగు వల్ల పంట త్వరగా కోతకు వస్తుందని తెలిపారు. యాసంగి పంటకు అనుకూలం, సాగు నీటి అవసరం కూడా తక్కువ ఉంటుందన్నారు.

స్వల్ప కాలిక వరి రకాలు..

వరి రకం	పంట కాలం	దిగుబడి
తెలంగాణ సోన(ఆర్ఎన్ఆర్-15048 125)	125	26-28
వరంగల్ వరి(డబ్ల్యూజీఎల్-1119)	115-120	28
కూనారం-వరి-2(కేఎస్ఎం-1638)	120-125	30-34
వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్-962)	120-125	26-30
జగిత్యాల సాంబ(జేజీఎల్-3844)	120-125	26-28
జగిత్యాల సన్నాలు(జేజీఎల్-1798)	125	20-25
ఎర్రమల్లెలు(డబ్ల్యూజీఎల్-20471)	125	20-22
కూనారం వరి(కేఎస్ఎం-733)	120	29-33

ఈ రకాలు మన ప్రాంతానికి అనుకూల సన్నరకం వరి విత్తనాలని నగేష్ తెలిపారు. జూలై 20వ తేదీ వరకు నారు పోసుకోవడానికి అనుకూల రకాలన్నారు. డివిజన్ రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన రకాలు ఎంచుకుని సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



రైతులకు స్ప్రే పంపులు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

హన్మకొండ : పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్షయ్యపల్లి గ్రామంలో రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దిలీప్‌కుమార్, రాములు, శ్రావణ్ కుమార్, మధు.. రైతులకు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తి పంటలో పాటించాల్సిన పద్ధతులను వివరించి, అధిక సాంద్రత పత్తితో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా 40 మంది రైతులకు మందు పిచికారీ చేసే చేతి పంపులను ఉచితంగా అందించారు.